ప్రజాశక్తి
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023 5
శ్రీ సత్యసాయి



# మండలి నామినేషన్లు మొదలు

## తొలిరోజు రెండు దాఖలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు ప్రక్రియ మొదలైంది. గురువారం నాడు రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యాయుల నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంవి.రామచంద్రా రెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

# వేగవంతంగా రీసర్వే, గృహ నిర్మాణాలు

## రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డా॥ జవహర్ రెడ్డితో కలెక్టర్ బసంత్‌కుమార్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

జిల్లాల్లో రీసర్వే, గృహ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ బసంత్‌కుమార్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డా॥జవహర్‌రెడ్డికి తెలియజేశారు. గురువారం సాయంత్రం రీ సర్వే, ఇంటి స్థలాలు, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖలు, గ్రామ వార్డు సచివాలయం వ్యవస్థ, ఈ క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంబంధిత కార్యదర్శులతో అమరావతి నుంచి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్‌ఒ కొండయ్య, సంబంధిత జిల్లా అధికారులు ఇందులో పాల్గొన్నారు. హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం పంపిణీపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వివరణ కోరగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర హైవే నిర్మాణంలో భాగంగా జిల్లాలో 650 హెక్టర్ల భూమిని సేకరించామని చెప్పారు. ఫిబ్రవరి మాసానికి 300 హెక్టార్ల భూమికి సంబంధించిన రైతులకు న్యాయమైన పరిహారాన్ని అందించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై జిల్లాలో చేపడుతున్న భుహక్కు, భూ రక్ష రీసర్వే లో గ్రౌండ్ వ్యాలిడేషన్, డిఎల్ఆర్ పబ్లిష్ చేయడం, హక్కు పత్రాలు అందజేయడం వంటివి ఫిబ్రవరి మాసాంతానికి సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుందని సూచించారు. జాతీయ రహదారులు, ఎపిఐఐసి కోసం భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. స్పందన అర్జీలపై సకాలంలో స్పందించి బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా అర్థవంతమైన పరిష్కారం అర్జీదారులకు చూపాలన్నారు. రెవెన్యూ అంశాలు మరింత జాగ్రత్తగా పరిశీలన, త్వరితగతిన అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కరించాలని తెలిపారు. వ్యవసాయశాఖకు సంబంధించి రబీ వరి పంటకు ఈ క్రాపింగ్ పూర్తి చేయాలన్నారు. వరి ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల సంస్థ సన్నద్ధం కావాలని అన్నారు. పిఎం కిసాన్ ఈకెవైసి సకాలంలో పూర్తి చేయాలని, ఏదైనా తగ్గుదల ఉంటే సరైన కారణాలు నివేదికలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, సుబ్బారావు, చంద్రశేఖర్, పద్మావతి, హౌసింగ్ అధికారి చంద్రమౌళి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రషీద్, డిడబ్ల్యుఎంఎ అధికారి రామాంజనేయులు, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

- ◆ 108 అంబులెన్స్‌లకు సుస్తి
- ◆ నిర్వహణ లేక మధ్యలోనే ఆగిపోతున్న వాహనాలు
- ◆ రోగులకు ప్రాణ సంకటం
- ◆ సిబ్బందికీ తప్పని ఇక్కట్లు

## కుయ్‌..కుయ్‌ కాదు..

# కుయ్యో.. మొర్రో..!

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే 108 వాహన సేవలకు సుస్తి చేసింది. కూయ్..కూయ్... అని వెళ్లాల్సిన ఈ వాహనాలు నిర్వహణ లేక కుయ్యో.. మొర్రో అంటున్నాయి. అత్యవసరంగా వైద్య సేవల కోసం ఎక్కిన రోగులకు వాహనం దయనీయ స్థితి చూసి ప్రాణ సంకటంగా మారుతోంది. ఆపత్కాలంలో ఆసుపత్రికి సకాలంలో చేరగలమా లేదా అన్న సందేహంతో రోగులు బిక్కుబిక్కుమనే పరిస్థితులు నెలకుని ఉన్నాయి. 15 నిమిషాల్లోపు వైద్యసేవలను దీని ద్వారా అందజేస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా... ఆసుపత్రికి చేరేలోపే వాహనం మధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు తాజాగా ఉదాహరణ సాక్ష్యంగా నిలుస్తోంది. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో శ్వాసకోస సంబంధిత జబ్బుతో ఒక రోగి చేరాడు. ఆయనకు బుధవారం అర్ధరాత్రి సమయంలో సమస్య తీవ్రమవడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేశారు. అతన్ని తీసుకుని కుటుంబ సభ్యులు 108లో ధర్మవరం నుంచి బయలుదేరారు. జాతీయ రహదారి 44 బెంగళూరు నుంచి హైదారాబాద్ వెళ్లే మార్గం గుండా అనంతపురం వైపు వస్తోంది. ఈ సమయంలో ఈ వాహనానికి హెడ్‌లైట్స్‌గానీ, రాత్రి సమయాల్లో అంబులెన్స్‌లకు వెలిగే బ్లింకర్సుగానీ, సైరన్ కూడా పనిచేయలేదు. చిన్న లైట్ల వెలుగులోనే ఈ వాహనం ఇబ్బందిపడుతూ వచ్చింది. దీన్ని ఒక సీనియర్ జర్నలిస్టు గమనించి ఆ వాహనం వెంట వచ్చి సమస్య గురించి అనంతపురం సర్వజన ఆసుపత్రి వద్ద ఆరా తీశారు. అప్పుడు ఈ వాహనాన్ని కున్న ఇబ్బందుల గురించి తెలిసిందని చెప్పారు. దీనిపై మరింతగా ఆరా తీయగా మరిన్న లోపాలు వెలుగు లోకి రావడం గమనార్హం. జిల్లాలో ప్రతి మండలానికీ ఒక 108 వాహనం, పుర పాలక పట్టణాలకు నాలుగు చొప్పున ఉన్నాయి. అయితే వీటి నిర్వహణ మాత్రం అధ్వాన్నంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చాలా వాహనాలకు కనీసం ఉండాల్సిన స్టెప్నీ టైరు కూడా అందుబాటులో లేనట్లు ప్రజాశక్తి పరిశీలనలో తెలిసింది. నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో వాహనాలు మధ్యమధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రకంగా ఇటీవలి కాలంలో ఉరవకొండ, శెట్టూరు, కణేకల్ ప్రాంతాల్లో వాహనంలో రోగిని ఆసుపత్రికి చేర్చే సమయంలో మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో చేసేది లేక రోగులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రోగులు ఎలాగున్న సరే ముందు వాహనం గమ్యస్థానం చేరితే చాలు అన్న చందంగా మారింది.

### సిబ్బందికీ తప్పని కష్టాలు

108 వాహనాలకే కాదు.. సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 260 మంది సిబ్బంది 108 సేవల్లో పనిచేస్తున్నారు. వీరికి సక్రమంగా వేతనాలు కూడా అందని పరిస్థితులు నెల కొన్నాయి. మూడు నెలలకు ఒకసారి వేతనాలు అందుతు న్నాయి. బకాయిలు జనవరి నెలలో పడటంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. నిర్వహణ లేక వాహనాలు మధ్యలో ఆగిపోతుండటంతో ఆ భారాలు కూడా ఒక్కోసారి వారిపై పడు తుండటం గమనార్హం.

### ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాలి

అనారోగ్య సమస్యల్లోనున్న వారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి, వారికి వైద్యమందివ్వడం ద్వారా ప్రాణాలను నిలుపవచ్చు. ఇంతటి మహోన్నతమైన పనిని చేసే 108 వాహనాలు, సిబ్బంది. దీన్ని ప్రభుత్వం కూడా ప్రతిష్టాత్మకంగానూ చేపట్టినట్టు చెబుతోంది. కాని ఆచరణలో చూసినప్పుడు వీటి నిర్వహణ పై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. దీంతో వాహనాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాలి. ఎంతో విలువైన సేవలందిస్తున్న సిబ్బందికీ వేతనాలను ఎప్పటికప్పుడు అందజేయాలి.

**నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు.**

# యాప్‌ను రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం

## కార్మికుల వద్ద సెల్‌ఫోన్లు లేకపోతే ఎలా హాజరు వేయాలి.. - సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప

**ప్రజాశక్తి-హిందూపురం**

పురపాలక సంఘాల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు ముఖ హాజరు యాప్‌ను రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప డిమాండ్ చేశారు. యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని కల్లూరు సుబ్బారావు ఉద్యానవనం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్ ఛాంబర్ ముందు నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేసే వరకు కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. పారిశుధ్య కార్మికుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. వీరందరికీ స్మార్ట్‌ఫోన్లు లేవన్నారు. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాన్ని అనుసరించి కార్మికుల హాజరు విధానం ఎండిఎఫ్ ఆర్ఎస్ స్థానంలో ఎపిఎఫ్ఆర్ఎస్‌ను జిఓ 159 మేరకు గత నెల 16వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్‌ఫోనులో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫొటో తీసి ప్రభుత్వం తయారు చేసిన యాపు ద్వారా హాజరు పంపించాలని నిబంధనలు పెట్టడం అన్యాయమన్నారు. మున్సిపల్ కార్మికుల్లో అత్యధిక మంది అసలే చదువు రానివారు, అందులోనూ అత్యధిక మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు లేవన్నారు. ఒకవేళ ఎవరి వద్ద అయినా సెల్ ఉంటే నెట్‌వర్క్, సర్వర్ లేకపోవడం వంటి సమస్యల వల్ల కార్మికులు గంటల తరబడి మున్సిపల్ కార్యాలయం ముందు సెల్‌ఫోన్లు చేతుల్లో పట్టుకుని ఫేస్ యాప్ నమోదు చేయడానికి నానా తంటాలు పడుతున్నారు. దీంతో కార్మికులు హాజరు అయినప్పటికీ, ముఖ ఆధారిత హాజరులో హాజరు కాలేదని పడుతుంది. హాజరుకాని రోజుల వేతనాలు ఇవ్వకుండా రద్దు చేయడంతోపాటు కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కావున కార్మికులకు శాపంగా ఉన్న ఈ యాప్‌ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 26న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆనంద, మంజు, నాగేంద్ర, చంద్ర, నరసింహమూర్తి, రామాంజనేయులు, మంజూనాథ్, ఓబులమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న పారిశుధ్య కార్మికులు

# వైభవంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

## 'పురం'లో పరదేశీయ పాలన : నవీన్‌నిశ్చల్ - హాజరైన ఆంధ్ర, కర్నాటక బలిజ నేతలు

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని గురువారం వైభవంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం గౌరవాధ్యక్షులు, ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్‌నిశ్చల్ ఆధ్వర్యంలో పట్టణంలో వేలాది మంది బలిజలు ప్రధాన రహదారి గుండా పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ హిందూపురంలో ఇప్పటికే 20 విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. వాటిని ఏర్పాటు చేసే సమయంలో రాని నిబంధనలు ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసే సమయంలో వచ్చాయన్నారు. రాయల విగ్రహం ఏర్పాటు చేసే విషయంలో పరదేశీయ హిందూపురం పాలకులు అడ్డుకున్నారని ఆరోపించారు. మోచేతి నీళ్లు తాగేంతవరకు రాజకీయంగా ఎదగలేమన్నారు. మనమందరం ఐక్యమత్యంగా ఉంటే మనదే అధికారమన్నారు. రాష్ట్రంలో 5 కోట్ల మంది జనాభా ఉంటే అందులో బలిజలు మాత్రమే 1.25కోట్ల మంది ఉన్నామన్నారు. ఇంత మంది ఉన్నప్పటికీ చట్టసభల్లో ఎంతమంది ఉన్నామన్నా విషయాలను అందరూ గుర్తించుకోవాలన్నారు. ఏ పార్టీలో ఉన్నా బలీజలకు బలిజలు సహకరించినప్పుడే అందరూ ఎదగడానికి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు రామచంద్రయ్య, ప్రభుత్వ విప్ సామినేని ఉదయబాను, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, చింతల పార్థసారథి, గురుమోహన్, రాఘవయ్య, ప్రకాష్, మురళి, రవికుమార్, వేణుగోపాల్, భానుప్రసాద్, తేజేశ్వరి, మమత దేవారాజ్, రూపా అనంతరాజ్, చిక్క నరసింహయ్య, గణేష్, ఆకుల ఉమేష్, నంజప్ప, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో బలిజ కుల ప్రముఖులు పాల్గొన్నారు.

రాయల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

# అయ్యా బతికే ఉన్నాం.. పింఛన్ ఇవ్వండి..

## కమిషనర్ వెంకటేశ్వరరావు ఎదుట వృద్ధుల కంటతడి

**ప్రజాశక్తి-హిందూపురం**

'అయ్యా మేము బతికే ఉన్నాం.. గతం నుంచి పింఛన్ కానుక తీసుకుంటూనే ఉన్నాం.. అయితే ఇప్పుడు మేము చనిపోయామని పింఛన్ రద్దు చేశారు.. మా పింఛన్ మాకివ్వండి..' అంతూ ఇద్దరు వృద్ధులు వేడుకున్నారు. ఈమేరకు గురువారం పట్టణంలో కమిషర్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించి బోరున విలపించారు. ఈ సందర్భంగా పింఛన్‌దారులు ఆబీదా మాట్లాడుతూ తనకు 2019 నుంచి పెన్షన్ వస్తోందన్నారు. అయితే బంధువుల సహకారంతో డిసెంబర్‌లో పవిత్ర మక్కా యాత్రకు వెళ్లానన్నారు. ఆ సమయంలో కూడా తమ వాలంటీర్ ద్వారా సచివాలయంలో ఉన్న అధికారిని కలిసి డిసెంబర్ మొదటి వారంలో ఉండమని రాత పూర్వకంగా సమచారం ఇచ్చామన్నారు. అలాగే మరో వృద్ధురాలు గుల్షీరా తమ బంధువులు హిందూపురం నుంచి జీవనోపాధి కోసం ఢిల్లీకి వెళ్లారు. అక్కడ వారికి ఆరోగ్యం బాగా లేదని, తనను రావాలని పిలిస్తే పరామర్శించడానికి వెళ్లానన్నారు. అయితే తాను కూడా ఆ సమయంలో వాలంటీర్ సహకారంతో సచివాలయంలో లిఖిత పూర్వకంగా సమచారం అందించి వెళ్లామన్నారు. ఈనేపథ్యంలో తాము మృతిచెందినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేశారన్నారు. దీంతో తాము రెండు నెలల నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంపదించి తాము బతికే ఉన్నామని నిర్ధారించి తమకు పింఛన్ ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కమిషనర్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న వృద్ధులు

# 'పురం'లో వేగంగా రైల్వే రోడ్డు విస్తరణ పనులు

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణానికి తలమానికంగా ఉన్న రైల్వే రోడ్డు విస్తరణ పనులు జోరందుకున్నాయి. ఇందులో భాగంగా గురువారం రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు జెసిబి సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే రోడ్డుకు ఇరువైపులా 163 దుకాణాలు, ఇళ్లు ఉన్నట్లు ప్రయివేటు ఏజెన్సీ సర్వే నివేదిక ఇచ్చిందన్నారు. దీంతో సంబంధిత యజమానులతో పలు దఫాలు చర్చించగా ఇప్పటి వరకు 80 శాతం మంది తమ అంగీకారం పత్రాలను అందజేశారన్నారు. కట్టడాల తొలగింపు కోసం 117 మందికి పరిహారాన్ని మున్సిపాలిటీ అందజేయగా కోల్పోయిన స్థలాన్ని గుర్తించి దాని మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు అధికంగా ఇస్తూ టిడిఆర్ బాండ్లను జారీ చేశామన్నారు. 36 మంది విస్తరణ పనులను వ్యతిరేకిస్తూ తాము నష్టపోతామని కోర్టును ఆశ్రయించారన్నారు. అయితే అన్నివిధాలా పరిశీలన చేసిన న్యాయస్థానం డ్యూ ప్రాసెస్ కింద చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. అంగీకరించని వారి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ చట్టం ప్రకారం ల్యాండ్ అక్విజేషన్‌కు వెళ్తామన్నారు. అప్పుడు మిగిలిన వారికి వచ్చినట్లు టిడిఆర్ మొత్తం వీరికి ఇవ్వనున్నట్లు తెలిపారు. మిగిలిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంగీకరిస్తూ తమ లేఖలను ఇస్తే విశాలమైన రోడ్డు, ఫుట్‌పాత్, పార్కింగ్ సౌకర్యం, సెంట్రల్ లైటింగ్, తదితర పట్టణ సుందరీకరణ చేయడానికి సాధ్యం అవుతుందన్నారు. కావున పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

హిందూపురంలో రైల్వే రోడ్డులో జెసిబితో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

# ఎపిఎఫ్ఆర్‌సి విధానాన్ని రద్దు చేయాలి

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కోసం తీసుకొచ్చిన ఎపిఎఫ్ఆర్‌సి విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.ఆదినారాయణ, ఆయూబ్‌బాను డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం తలపెట్టిన ధర్నాను ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున రద్దు చేసి మున్సిపల్ మేనేజర్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ధర్మవరం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా కార్మికులను సచివాలయాలకు బదలాయించడం బాధాకరమన్నారు. బదలాయించడంలో మున్సిపల్ కమిషనర్ ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు ఇంతకుముందులాగే మస్టర్ పాయింట్ ద్వారానే పనిని కొనసాగించాలని, లేనిపక్షంలో రాబోవు రోజుల్లో ధర్నా, ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు నాయకులు ఎస్‌హెచ్ బాషా, మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, చెన్నకేశవులు, లక్ష్మీఓబులేసు, ప్రసాద్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ 2కు ఎంపికైన మహిళా కానిస్టేబుల్

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళ కానిస్టేబుల్ స్నేహ గ్రూప్ 2 లో గణాంకాల అధికారిగా ఎంపికైంది. లేపాక్షి మండలం మానెంపల్లికి చెందిన గోపాల్ పద్మావతి దంపతుల కుమార్తె స్నేహ మహిళ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే, ఉన్నత కొలువు సాధించాలనే తపనతో ప్రయత్నాలు సాగించింది. ఇందులో భాగంగా గురువారం విడుదలైన గ్రూప్ 2 ఫలితాల్లో గణాంకాల అధికారిగా స్నేహ ఎంపిక కావడం పట్ల ఆమె తల్లి తండ్రులు, సహ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ స్నేహ

తూమకుంట పారిశ్రామిక వాడ

# సారొచ్చారు.. వెళ్లారు...

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పారిశ్రామిక వాడలోని పరిశ్రమలను తనిఖీ చేయడానికి కర్నూల్ నుంచి గురువారం వచ్చిన బాయిలర్ ఇన్‌స్పెక్టర్ తూతూమంత్రపు తనిఖీలు చేశారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. తాను తనిఖీకి వస్తున్నట్లు ముందుగానే పరిశ్రమల నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో పాటు, తూతూమంత్రపు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. తనిఖీల అధికారులు వివరాలు వెల్లడించకుండా, పారదర్శకత పాటించకుండా ఉండటం వెనుక మామూళ్లే కారణమన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం ప్రాంతాల్లో ఉన్నాయి. ఇక్కడ చిన్న పెద్ద పరిశ్రమలు కలిపి దాదాపు 150కి పైగా ఉన్నాయి. హిందూపురం పారిశ్రామిక వాడలోని పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ ప్రధానంగా ఉన్న ఇనుము-ఉక్కు తయారీ పరిశ్రమల్లో బాయిలర్లు పగిలి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం రివాజుగా మారింది. ఈ ప్రమాదాల్లో కార్మికులు మరణించడం, గాయపడటం ఏటా జరుగుతోంది. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఉత్తర ప్రదేశ్, బీహార్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో వివరాలు కూడా సరిగా బయటకు రావడం లేదు. కార్మిక శాఖ అధికారులు వలస కార్మిక చట్టం అనుసరించి వారి వివరాలను సేకరించాల్సి ఉన్నప్పటికి చట్టాన్ని వారు అమలు చేయడం లేదు. వలస కార్మికుల కష్టాలను ఎవరూ ఎవరూ పట్టించుకోరు. పారిశ్రామిక వాడలోని రసాయనాల తయారీ పరిశ్రమలు కనీస భద్రతా ప్రమాణాలను పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదకరమయిన రసాయనాలను సైతం బయటకు వదిలేస్తున్నారు. వేసవిలో పరిశ్రమల్లోని బాయిలర్లు పేలి, ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువ. దీంతో సంబంధిత అధికారులు తప్పని సరిగా తనిఖీలు నిర్వహించి, పరిశ్రమల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలను వారికి చెప్పాలి. అయితే ఈ శాఖ అధికారులు పరిశ్రమల నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలంటు మెనూ సైతం చెప్పి పరిశ్రమలలోనే భోజనాలు చేసి, తూతూమంత్రపు తనిఖీలకు పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు నుంచి రావడం, పోవడంతోనే సరిపెడుతున్నారు. ఇదే రీతిలో గురువారం కర్నూల్ నుంచి బాయిలర్ ఇన్‌స్పెక్టర్ పరిశ్రమల నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో పాటు, తూతూమంత్రపు తనిఖీలు నిర్వహించి, తనిఖీకి సంబంధించిన వివరాలు ప్రజాశక్తి అడిగినప్పటికి వెల్లడించకుండా వెళ్లిపోయారు. కనీసం ఎన్ని పరిశ్రమలు తనిఖీ చేశారు. లోటు పాట్లు ఉన్నాయా..? అని అడిగినప్పటికి తనకు 20 సంవత్సరాల అనుభవం ఉందని చెప్పి అనంతపురం వద్ద మరో పరిశ్రమను తనిఖీ చేయాలని వెళ్లిపోయారు. కర్నూలు నుంచి రావడం, పోవడంతోనే సరిపెడుతున్నారు. తనిఖీల అధికారులు వివరాలు వెల్లడించకుండా, పారదర్శకత పాటించకుండా ఉండటం వెనుక మామూళ్లే కారణమన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఏ పరిశ్రమను తనిఖీ చేశారు.. వాటిలోని బాయిలర్లను మళ్లీ ఎప్పుడు తనిఖీ చేస్తారు అనేది పరిశ్రమ బయట నోటీసు బోర్డులో ఉంచాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

### తూతూమంత్రంగా మారిన పరిశ్రమల తనిఖీ

## నేరాలు ఘోరాలు

### అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య

**రొద్దం:** అప్పుల బాధతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెద్దకోడిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ శంకర్ (42) అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

### నాటుసారా పట్టివేత

**రొద్దం:** మండలంలోని కొగిర గ్రామంలో నాటు సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది దాడులు నిర్వహించిందన్నారు. గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి స్కూటీలో 20 లీటర్ల సారా తీసుకువెళుతుండగా సీజ్ చేసినట్లు చెప్పారు. నాటుసారా, స్కూటీని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు మహేష్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

### మామిడి, జామ తోట దగ్ధం

**ఓబులదేవర చెరువు :** మండలంలోని ఆకుతోట పల్లి వద్ద గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓడి చెరువు గ్రామానికి చెందిన మనోహర్ అనే రైతుకు చెందిన మామిడి, జామ తోట దగ్ధమైంది. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మామిడి, జామ, అల్లనేరేడు తోట అగ్నిప్రమాదంలో దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఎండుగడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి 100 జామ, 50 మామిడి, 60 అల్లం నేరేడు చెట్లతో పాటు డ్రిప్, స్పింక్లర్ల పైపులు కాలిపోయాయన్నారు. దీంతో తనకు మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

### సీనియర్ న్యాయవాది రాజశేఖర్ మృతి

**హిందూపురం :** స్థానిక సీనియర్ న్యాయవాది కెఎస్. రాజశేఖర్ (73) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స అనంతరం ఇటీవల హిందూపురానికి వచ్చారు. ఇంట్లో ఉన్న సమయంలో గురువారం ఉదయం గుండెపోటుకు గురై మృతిచెందాడు. రాజశేఖర్ మృతికి స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎడిజె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జిలు స్పందన, రాజ్యలక్ష్మి, ప్రత్యేక న్యాయమూర్తి ఆనంద తీర్థలతో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

### మృతుని కుటుంబానికి పరామర్శ

**రొద్దం :** మండలంలోని సానిపల్లికి చెందిన మాల మహానాడు సీనియర్ నాయకులు కేశవయ్య (75) గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి మేనల్లుడు శశిభూషణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కేశవయ్య మాలల అభివృద్ధికి చేసిన కృషిని ఆసంఘం నాయకులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, ఓబులేసు, మూర్తి, లాయర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం వద్ద నాయకుల నివాళి

### శివ భక్తులకు సర్పంచి ఆర్థికసాయం

**రొద్దం :** మండలంలోని కంబాలపల్లి సర్పంచి మంజు గ్రామానికి చెందిన శివభక్తులకు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొంతమంది శివస్వాములు గురువారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచి శివభక్తులకు రూ. 5వేలను అందజేశారు.

### కోవెలగుట్టపల్లిలో ధ్వజస్తంభ స్థాపన

**పుట్టపర్తి రూరల్ :** మండల పరిధిలోని కోవెలగుట్టపల్లిలోని లక్ష్మీ వెంకటేశ్వర నూతన దేవాలయం ముందు ధ్వజస్తంభ స్థాపన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో 15 లక్షల వ్యయంతో గుడి నిర్మాణం చేసినట్లు వారు తెలిపారు.

### మెరుగైన విద్యాబోధన అందించాలి

**గాండ్లపెంట :** విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని రాష్ట్ర పరిశీలకులు జాఫర్ హుసన్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో విద్యాభ్యాసంపై చర్చించారు. మంచి ఫలితాలు సాధించాలని వివిధ అంశాలపై విద్యార్థుల స్థాయిని పరీక్షించే విధానాన్ని మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఆధ్యాపకులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, గంగాధర్, చిన్నప్పయ్య, జయరాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రహదారి ప్రారంభం

**సోమందేపల్లి :** మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు వరసల రోడ్డును పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామస్తులు రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం సుమారు ఐదు కోట్ల రూపాయల నిధులతో 80 అడుగుల వెడల్పు గల నాలుగు లైన్ల రోడ్లను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, కన్వీనర్ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ డిసి. అశోక్, వైసిపి నాయకులు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, కస్తూర్బా పాఠశాల చైర్మన్ రామాంజనేయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న పంటల పరిశీలన

**ఓబుల దేవర చెరువు:** మండలంలోని కుసుమారుపల్లి పొలాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఎఒ ఇలియాజ్ గురువారం పరిశీలించారు. పంటకు కత్తెర పురుగు ఆశిస్తోందని గమనించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విఎఎ పవన్ కుమార్, రైతులు ఈశ్వరయ్య, రామాంజి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### బాధితురాలికి ఆర్థికసాయం

**కదిరి టౌన్ :** మండలంలోని మీటేనాయక్ తండాకు చెందిన బాధితురాలికి ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన భూక్య నీలాబాయికి చెందిన పాడి గేదె మృతిచెందడంతో జీవనోపాధి కోల్పోయింది. విషయం తెలుసుకున్న ఎంపిపి అమర్నాథ్ రెడ్డి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో రూ. 20 వేలు మహిళకు అందజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి రూరల్ మండలం, ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

### వ్యవసాయ శాఖ డైరీ ఆవిష్కరణ

**పుట్టపర్తి రూరల్:** జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ డైరీ ని జిల్లా వ్యవసాయధికారి వైవి సుబ్బారావు గురువారం ఆవిష్కరించారు. ఏడిఎ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సంఘం ఆధ్వర్యంలో డైరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి చక్రపాణి రెడ్డి, ఈసీమెంబర్ ఉపేంద్ర రెడ్డి, జిల్లా సంఘం సభ్యులు, ఆనంద నాయక్, రియాజ్, ప్రసాద్, అశోక్, సునీత ,రాఘవేంద్ర రెడ్డి, సుధాలక్ష్మి, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల నూతన భవనం ప్రారంభం

**గోరంట్ల :** పట్టణంలో ప్రభుత్వ బాలికల గిరిజన పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన నూతన భవనాన్ని గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ సౌతాఫ్రికాకు చెందిన ఎన్నారై నవనీతం నాయకరణ్, దేవేంద్ర నన్, శ్రీహరికోటలో సైంటిస్టుగా పనిచేస్తున్న రబ్బగుండ ముఖేష్ అనే దాతలు ఇచ్చిన మూడు లక్షల రూపాయల విరాళంతో డార్మిటర్ నూతన భవనాన్ని నిర్మించడం జరిగిందని చెప్పారు. భవన నిర్మాణానికి సహాయం అందించిన దాతలకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నారైలు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్ నాయక్, తనకల్లు మండలం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలు ఏకరువు

**అమరాపురం :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, జెడ్పీటీసీ స్వారక్క, ఎంపిడిఒ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కోఆప్షన్ సభ్యులు రసూల్‌బాషా, సర్పంచులు తిప్పేస్వామి, భాగ్యమ్మ, చిత్తప్ప యాదవ్ తదితరులు మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ విధానంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నాగు నేడు పనుల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం కార్మిక, కర్షక భవనం

## సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజల కోసం జిల్లా కేంద్రంలో కార్మిక, కర్షక భవనాన్ని నిర్మిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ సత్య సాయి జిల్లా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో బేసిరెడ్డి నాగమ్మ పేరుతో చేపడుతున్న కార్మిక కర్షక భవన నిర్మాణ పనులను సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ గురువారం పరిశీలించారు. ఆయనతోపాటు జిల్లా సెక్రటరీ ప్రవీణ్, రామకృష్ణ, పైపల్లి గంగాద్రి తదితరులు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాగమ్మ గారి పోరాటాల స్పూర్తిగా ఆమె ఆశయాలు కొనసాగింపు కోసం జిల్లా కేంద్రంలో భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇది కేవలం ఉద్యోగ ,కార్మిక , కర్షకులకే కాకుండా దీనివలన పేద ప్రజలకు ఉపాధి కలిగే విధంగా ఉంటుదన్నారు. ఇందులో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాలు, ప్రజలకు ప్రాథమిక చికిత్స కోసం వైద్య కేంద్రం, కళాకారుల అభివృద్ధి కోసం ఈ భవన సముదాయం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ భవన నిర్మాణ పనులు ఇప్పుడే మొదలయ్యాయని ఇందుకోసం ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి తమ తోడ్పాటు ఇస్తున్నారని చెప్పారు. మరింతమంది మానవతావాదులు, పార్టీ అభిమానులు, కార్మికులు, రైతులు సహకరించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించాలని వారు కోరారు.

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

### మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**పుట్టపర్తి అర్బన్ :** పుట్టపర్తి మున్సిపాలిటీ లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని అవుట్‌సోర్సింగ్‌కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు అనుబంధ మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీ లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ముఖ హాజరు యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్‌ను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గౌస్ లాజామ్, పైపల్లి గంగాద్రి, మున్సిపల్ కార్మికులు పెద్దన్న, రామయ్య, పెద్దన్న, నరసింహులు, నాగార్జున, కేశవ, సాయికుమార్, రామంజి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా గోవిందప్ప

ప్రజాశక్తి మడకశిర రూరల్

గుడిబండ మండలం రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని జానకిరామయ్య కళ్యాణమండలంలో సంఘంం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన గోవిందప్ప మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావును ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమలో ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గోవిందప్పను అభినందిస్తున్న నాయకులు

సమావేశంలో పాల్గొన్న నాయకులు

### వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**కదిరి అర్బన్ :** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి, బోయసఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేవారు. ఈ మేరకు ఆయన గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని గతంలో ఆందోళనను దీక్షలు చేస్తుంటే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పందించి త్వరలోనే ఎస్టీ జాబితాలో పునరుద్దించడానికి కమిషన్ వేసి వాటి నుంచి వచ్చిన జాబితాను మంత్రివర్గంలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని మాట ఇచ్చారన్నారు. అయితే వారిచ్చిన మాటకు అతీగతీ లేదన్నారు. ఇప్పటికైనా త్వరలో జరగనున్న మంత్రిమండలి సమావేశంలో బిల్లును ఆమోదించకపోతే వచ్చే ఎన్నికల్లో వాల్మీకి బోయలు తగిన గుణపాఠం నేర్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు, క్రాంతి కుమార్ నాయుడు బోయ, సురేష్, మోహన, నాని, కేశవ, శివప్రసాద్, అనిల్, అర్జున్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి గుడిబండ

మండలంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది రైతుల నుంచి ప్రజల నుంచి ముక్కు పిండి లంచం వసూలు చేస్తున్నారి అలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎంపిపి రాధమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. హాజరైన కొంతమంది సర్పంచులు పలు శాఖల అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విద్యుత్, వెలుగు, రెవెన్యూ శాఖల అధికారుల పనితీరుపై విమర్శించారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదన్నారు. సమస్యలపై విద్యుత్ అధికారులు లైన్‌మెన్లు స్పందించడం లేదని విమర్శించారు. అదేవిధంగా వెలుగు కార్యాలయంలో వివిధ పంచాయతీలో పనిచేస్తున్న పలువురు సీసీలు సంఘంలో ఉన్న మహిళలని మభ్యపెట్టి డబ్బులను డ్రా చేసుకొని వాడుకుంటున్నారని అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో పలువురు వీఆర్వోలు పట్టాదారు పాస్ పుస్తకాలకు ధర నిర్ణయించి రైతుల నుంచి వేలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. వీరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి రత్నమ్మ శివన్న, జెడ్పీటీసీ భూతరాజు, ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ నాగభూషణ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి కదిరి అర్బన్

మార్చి నెలలో నిర్వహించే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, పాలకులతో గురువారం సమీక్ష నిర్వహిచారు. ఆలయ ఆవరణంలో పాలకమండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ ఈవో గురు ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. పాలకవర్గం, అధికారులు కలసి పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.. ఆలయంలో మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు అదనపు మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే శాశ్వత మరమ్మతు పనులు చేయించి కోనేరు రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. మాజీ శాసనసభ్యులు ఎమ్మెస్ పార్థసారథి మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నడుపుతున్నామని ఈ ఏడాది కూడా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దేవాదాయ ప్రధాన అర్చకులు పార్థసారధి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ప్రభుత్వ విధానాలపై రాష్ట్రవ్యాప్త సమ్మెకు సన్నద్ధం

### ఎపి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కార్ రావు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లపై ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 1 నుంచి సమ్మె బాట పట్టడానికి సన్నద్ధం అవుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆస్కార్ రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌వి జానకి రామయ్య కళ్యాణ మండపంలో జరిగిన జిల్లా ఉద్యోగుల సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమ్మెకు సన్నద్ధం కావాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని ప్రభుత్వ విధానాలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లతోపాటు మంత్రులకు ఒకటవ తేదీనే వేతనాలు ఇచ్చే ప్రభుత్వం ఉద్యోగులపై మాత్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్రంలో 10 లక్షల పైగా ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో అనేక హామీలు ఉద్యోగులకు ఇచ్చారన్నారు. అయితే అవి ఆచరణలో అమలు కాలేదన్నారు. ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించే విధంగా చట్టం చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్‌ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయి పడ్డ ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం, ఏకంగా కొన్ని పథకాలైన జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి రుణ సదుపాయం సైతం విడుదల చేయకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఉద్యోగుల అనుమతి లేకుండా, జిపిఎఫ్ ఖాతాల నుంచి ప్రభుత్వం విత్‌డ్రా చేసిన రూ. 480 కోట్లు వెంటనే జమ చేయాలని అరియర్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడ్డ ఆర్థిక ప్రయోజనాలు అన్ని ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రభుత్వం ప్రకటించాలన్నారు. తమ సమస్యలపై ఏప్రిల్ 1 నుంచి దశల వారీగా ఉద్యమిస్తామన్నారు. ఆలోపు అన్ని జిల్లాల్లో డివిజన్లో కార్యవర్గాలు ఏర్పాటు చేసి సంఘం బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రావు, కార్యదర్శి షేక్ బాబా సాహెబ్, రఘువీర రావు, నాయకులు రమేష్, రవిశంకర్ పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

సంఘం సత్య సాయి జిల్లాలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా భాస్కర్ రెడ్డి, సహ అధ్యక్షులుగా ఎస్. రమేష్, కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ చెన్నారెడ్డి, వేమారెడ్డి, తిరుపాల్, సంయుక్త కార్యదర్శిగా సుందర్‌రాజు, మల్లికార్జున, శ్రీదేవి, గోవిందు, గౌరీదేవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షులు రమేష్, నంద్యాల జిల్లా అధ్యక్షులు నరసింహులు, కృష్ణ, విశాఖ జిల్లాల అధ్యక్షులు సత్యనారాయణ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**In the Court of the Hon'ble Principal Junior Civil Judge: Kadari**

**O.S.No.61/2020**

**Between:**
Settipalli Sreenivasa Reddy S/o S.Hanumantha Reddy, Age:52 years, Bommireddy Palli, H/o Jogannapeta, Nallacheruvu Mandal. ...Plaintiff
And
Ballam Raghunatha Reddy, S/o B.Siva Reddy, age 44 years, D.No.1-22, yerracheruvu Palli, H/o T.Sadum, Tanakal Mandal. ...Defendant

**ప్రతివాదికి కోర్టు నోటీసులు**

పై దావాలో వాది అయిన ఎస్.శ్రీనివాసరెడ్డి ప్రతివాది అయిన బల్లం రఘునాథరెడ్డి అనే మీ మీద ప్రామిసరీ నోటు బాకీ వసూలు కోసం కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. పై దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం గౌరవ కోర్టువారు 01-03-2023వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు నీవు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకోవాలని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:01-03-2023.

కె.నాగేంద్రరెడ్డి, బి.ఏ., బి.ఎల్., అడ్వకేటు
కదిరి, సెల్:9440361798.

**In the Court of the Hon'ble Principal Junior Civil Judge: Kadari**

**O.S.No.65/2020**

**Between:**
Y.Ramachandra Naidu S/o Y.Muneppa, Age:50 years, D.No.1-21, Ratnalapalli (Vill), H/o Allugundu, Nallacheruvu Mandal. ...Plaintiff
And
Ballam Raghunatha Reddy, S/o Ballam Siva Reddy, age 44 years, D.No.1-22, yerracheruvu Palli (Vill),, H/o T.Sadum, Tanakal Mandal. ...Defendant

**ప్రతివాదికి కోర్టు నోటీసులు**

పై దావాలో వాది అయిన వై.రామచంద్ర నాయుడు ప్రతివాది అయిన బల్లం రఘునాథరెడ్డి అనే మీ మీద ప్రామిసరీ నోటు బాకీ వసూలు కోసం కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. పై దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం గౌరవ కోర్టువారు 01-03-2023వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు నీవు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకోవాలని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:01-03-2023.

కె.నాగేంద్రరెడ్డి, బి.ఏ., బి.ఎల్., అడ్వకేటు
కదిరి, సెల్:9440361798.

**మహారాజశ్రీ గౌ॥ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి**

**O.S.No.324/2022**

**Between:**
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, NP Kunta, Rep by its Senior Manager, N.P.Kunta ...Plaintiff
మరియు
శ్రీ చైదేశ్వరి మహిళా సంఘం, TN పల్లి, NP Kunta Mandalam, Un registered association represented by its members
D2) జి.అంజినమ్మ W/o గంగిరెడ్డి
D5) పి.సుభాషిణి W/o జయకుమార్
D7) పి.లక్ష్మీదేవి W/o వెంకటనారాయణ
All are r/at T.N. Palli, N.P. Kunta Mandalam. ...Defendants

**పై దావాలో D2, D5 మరియు D7 ప్రతివాదులకి దావా సమన్లు**

పై దావాలోని వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ఎన్.పి. కుంట వారు) డి2, డి5 మరియు డి7 ప్రతివాదులుగా అయినా మీ పైన మరియు ఇతరులు పై వాది బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసియున్నారు. పై దావాను ఘనమైన కోర్టువారు 31-03-2023వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు 31-03-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:31-03-2023.

జి.గురులింగస్వామి, బి.ఏ., బి.ఎల్.,
వాదితరపు వకీలు, కదిరి.

**In the Court of the Hon'ble Principal Junior Civil Judge: Kadari**

**O.S.No.601/2021**

**Between:**
Dhanaraju Venugopal S/o Dhanaraju Siddiah D.No.23-3, Dhanarajugaripalli (Vilage), H/o Kanamubpalli Village, Peddamandayam mandal, Chittoor Dist., ...Plaintiff
And
Muthike Anjineyulu, S/o Muthike Venkatanarayana, D.No.3-11, Opp:Essar Petrol Bunk, Kummaravandlapalli Village, Kadiri Rural. ...Defendant

**ప్రతివాదికి కోర్టు నోటీసులు**

పై దావాలో వాది అయిన ధనరాజు వేణుగోపాల్ ప్రతివాది అయిన ముతికే ఆంజినేయులు అనే మీ మీద ప్రామిసరీ నోటు బాకీ వసూలు కోసం కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. పై దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం గౌరవ కోర్టువారు 02-03-2023వ తేది వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు నీవు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకోవాలని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:02-03-2023.

కె.నాగేంద్రరెడ్డి, బి.ఏ., బి.ఎల్., అడ్వకేటు
కదిరి, సెల్:9440361798.